ఈనాడు జగిత్యాల
సోమవారం ఆగస్టు 31, 2026

పారేది చుక్కలు.. ఎదురుచూసేది ఎకరాలు

● సగటు వర్షపాతం నమోదైనా పూర్తిగా నిండని చెరువులు

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ఈ వానాకాలంలో ఎల్‌నినో వల్ల రాష్ట్రవ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైనా జిల్లాలో మాత్రం సాధారణ వర్షపాతం నెలకొంది. జూన్ 1 నుంచి ఈనెల 29 వరకు 653.7 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 642.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అయినప్పటికీ చెరువులు, కుంటల్లోకి పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ చెరువుల పరిస్థితి మెరుగ్గా ఉన్నా ఇంకనూ నీరు చేరాల్సి ఉంది.


జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట ముప్పారపు చెరువు

చెరువుల పరిధిలో 83 వేల ఎకరాలు

జిల్లాలో 100 ఎకరాలకు పైబడి విస్తీర్ణం కలిగిన 179 చెరువులు, 100 ఎకరాలకన్నా తక్కువ విస్తీర్ణమున్నవి 1,182 చెరువులున్నాయి. వేసవిలో చాలా చెరువుల తూములను తెరచి నీటిని ఖాళీ చేసి చేపలను పట్టారు. దీనికి తోడుగా ఈ వానాకాలంలో అన్ని మండలాల్లో సమృద్ధి వర్షాలు లేనందునా చిన్ననీటి వనరులు పూర్తిస్థాయిలో నిండలేదు. ఎస్సారెస్పీ పరిధిలో 1.63 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా చెరువుల పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 83 వేల ఎకరాల ఆయకట్టు ఉండటం వీటి ప్రాధాన్యతను వెల్లడిస్తోంది.

జగిత్యాల సీఈ పరిధిలో చెరువులు: 1,361
పూర్తిగా నిండి అలుగు పారుతున్నవి: - 44

శాతం	నిండినవి
0-25	146
25-50	204
50-75	272
75-100	695

6 మీటర్ల లోతులో భూగర్భ జలాలు

జిల్లాలో ఇప్పటివరకు సాధారణ విస్తీర్ణంలో 96 శాతంగా 3.72 లక్షల ఎకరాల్లో అన్నిరకాల పంటలను సాగుచేయగా ఇందులో వరి 2.88 లక్షల ఎకరాలుగా ఉంది. ఇంకనూ వరినాట్లు వేస్తుండగా సాగు వంద శాతాన్ని దాటనుంది. జిల్లాకు నీరందించే శ్రీరామసాగర్ తదితర ప్రాజెక్టుల నీటిని ఆయకట్టుకు వదిలే అవకాశం లేనందున భూగర్భ జలాల ఆధారితంగానే పంటలకు నీటిని పారిస్తున్నారు. ప్రస్తుతం 6 మీటర్ల లోతులో భూగర్భ జలాలుండగా జలమట్టం స్థిరంగా ఉండాలంటే చెరువుల్లోకి కొంతనీటిని తరలించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల నీటిని చెరువుల్లోకి తరలించేలా కాకతీయ కాలువ, వరద కాలువల పరిధిలో చేపట్టిన 449 తూముల నిర్మాణం పూర్తికాగా మిగిలిన 253 తూముల నిర్మాణాన్ని పూర్తిచేసి ఎస్సారెస్పీ లేదా ఎల్లంపల్లి నుంచి కొంతనీటిని ఎత్తిపోసి తరలిస్తే పైర్ల సాగుకు దన్నుగా ఉంటుంది.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

జగిత్యాల గ్రామీణం: పట్టణంలోని టౌన్-3 పరిధిలోని తీన్‌ఖని, పెద్ద మసీదు, కటికెవాడ, మంచినీళ్ల బావి, ఇస్లాంపురా, గాంధీనగర్, ఉప్పరిపేట, తెనుగువాడ, దగ్గులమ్మ గుడి, ఉస్మాన్‌పురా, రహమత్‌పురా, జెండా మహిళా, ఖిలాగడ్డ, తులసి నగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ గంగారం తెలిపారు.

ఎస్సారెస్పీకి 2 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం వరకు 2,180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 963 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టులో నీటినిల్వ 44.713 టీఎంసీలుగా, నీటి మట్టం 1079.90 అడుగులుగా ఉంది.

సెప్టెంబరులో ముమ్మరంగా పుష్కర పనులు

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

న్యూస్‌టుడే, ధర్మపురి : గోదావరి పుష్కరాలకు సంబంధించిన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు స్పష్టం చేశారు. ఇటీవల ధర్మపురిలోని దేవాలయ కార్యాలయంలో 'న్యూస్‌టుడే'తో ఆయన పుష్కరాల పనులపై మాట్లాడారు.



ప్రశ్న: పుష్కరాలకు సంబంధించి నిధులు, పనుల పరిస్థితేమిటి.

సమాధానం: గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చాయి. ధర్మపురి, భద్రాచలం, బాసర వంటి పుణ్యక్షేత్రాలతో పాటు, గోదావరి తీర ఆలయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు రూ.1000 కోట్లు మంజూరయ్యాయి. సెప్టెంబరు మొదటి వారంలో అన్ని పుష్కరక్షేత్రాల్లో పనులు ముమ్మరంగా చేపడతాం. ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి.

ప్ర : ఘాట్ల వద్ద తొక్కిసలాట, ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

స: ఏఐ ఆధారిత సీసీటీవీలతో రద్దీని ఎప్పటికప్పుడు లెక్కిస్తూ గరిష్ట పరిమితి మించకుండా విడతల వారీగా స్నానాలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. బైపాస్ రహదార్ల నిర్మాణంతో ఒకవైపు నుంచి భక్తులు లోనికి రావడం, మరో రోడ్డు నుంచి వెళ్లిపోవడం జరుగుతుంది. ఇలా శాస్త్రీయ దృక్పథంతో సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం.

ప్ర : డిజిటల్ టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించనున్నారు.

స: ప్రత్యేక పుష్కర మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దీని ద్వారా ఘాట్ల వద్ద రద్దీ, తాజా పరిస్థితి, పార్కింగ్ స్థలాలు, సమీప క్యాంపులు, వసతి గృహాల లభ్యత, పూజ సమయాల సమాచారాన్ని నేరుగా ప్రజలు తెలుసుకునేలా చర్యలు తీసుకుంటాం. యాప్‌కు ఇంకా తుది రూపం రాలేదు.

ప్ర: నదీ జలాలు కలుషితం కాకుండా ఏం చేస్తారు.

స : యువకులు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లతో ఎప్పటికప్పుడు నీటిశుద్ధి వ్యవస్థలపై సర్వే చేయిస్తూ పారిశుద్ధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నిరంతరం శుభ్రంగా ఉంచేలా, చెత్త రహిత కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నాం. ప్రైవేట్ సంస్థలతో ఇప్పటికే దీనిపై ప్రధాన క్షేత్రాల్లో సర్వే చేపట్టాం. నది కలుషితం కాకుండా మైకుల ద్వారా భక్తులను చైతన్యం చేస్తాం.

ప్ర : ఆలయాల వారీగా కేటాయించిన నిధులు

స: ధర్మపురి, కోటిలింగాలకు రూ.117 కోట్లు కేటాయించారు. వీటిలో దేవాదాయశాఖ ద్వారా మంజూరైనా రూ.10 కోట్లతో ఉగ్రస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నాం. రెండో విడతలో ఇరిగేషన్ ఆధ్వర్యంలో పుష్కరఘాట్లు, ఆర్అండుబీ శాఖ ద్వారా రహదారులు, బైపాస్‌రోడ్లు నిర్మించనున్నాం. గత పుష్కరాల సందర్భంగా ధర్మపురికి 50 లక్షలకు పైగా హాజరు కాగా.. ఇప్పుడు కోటికి పైగానే హాజరవుతారని భావిస్తూ ఏర్పాట్లు చేపడుతున్నాం. మొదటి విడతలో రూ.100 కోట్లు విడుదల కాగా.. తీర ప్రాంత, ఆలయాల అభివృద్ధికి ఉపయోగిస్తాం.

కనురెప్పలా కాపాడి.. ప్రాణం తీశావెందుకమ్మా!

● కూతురిని నడుముకు కట్టుకొని బావిలో దూకిన తల్లి
● ఇద్దరి మృతితో గొల్లపల్లి మండలం వెనుగుమట్లలో విషాదం

అమ్మా!.. ఎంత పని చేశావమ్మా..
నాకు చిన్న గాయమైతేనే తల్లడిల్లిపోతావు..
నేను తింటుంటే.. పొలమారితేనే విలవిలలాడతావు..
అలాంటి నువ్వు ఊపిరాడని నీటిలో ఎలా పడేశావమ్మా..
ఎంతో అల్లారుముద్దుగా పెంచావు..
నా భవిష్యత్తు కోసం కలలు కన్నావు..
చక్కగా తయారు చేసి బడికి పంపి సంబరపడ్డావు
తమ్ముడితో కలిసి ఆడుకుంటుంటే మురిసిపోయావు
క్షణికావేశంలో నా భవిష్యత్తు.. నీ కలలు గుర్తుకు రాలేదా..
నిండు నూరేళ్లు జీవించమని దీవించే నువ్వే జీవితాన్ని ముగించావు.
మనమిద్దరం కనిపించక తమ్ముడు గుక్కపట్టి ఏడుస్తున్నాడమ్మా
ఇంత కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నావమ్మా..


పిల్లలు అక్షిత, మహేందర్‌లతో తల్లి రజిత

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్‌లో తల్లి రజిత కూతురిని నడుముకు కట్టుకొని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మెట్టినిల్లు గొల్లపల్లి మండలం వెనుగుమట్లలో విషాదం నెలకొంది. చిన్నారి అక్షిత ఆవేదనకు అక్షర రూపమిది.

- న్యూస్‌టుడే, దండేపల్లి గ్రామీణం

వివరాలు ప్రధాన సంచికలో


పరీక్ష అనంతరం బయటకు వస్తున్న అభ్యర్థులు

నీట్ పీజీ.. ఒక్కరే గైర్హాజరు

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం జేఎన్టీయూ నాచుపల్లి కళాశాలలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయగా.. ఉదయం 7 నుంచి 8.30 వరకు అభ్యర్థులను తనిఖీ చేసి.. పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. 100 మంది అభ్యర్థులకు గాను 99 మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతమ్మ తెలిపారు. ఆర్డీవో మధుసూదన్ పరిశీలించారు.

సీట్ల కోసం పాట్లు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణమవడంతో ఆదివారం వెళ్లడంతో మెట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూసి, రాగానే సీట్ల కోసం ప్రయాణికులు పాట్లు పడ్డారు.


బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

నిలిచిన ఎలక్ట్రిక్ బస్సు

మల్యాల, న్యూస్‌టుడే: కరీంనగర్-2 డిపోనకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం సాయంత్రం జగిత్యాల నుంచి కరీంనగర్ వెళ్తుండగా సాంకేతిక కారణాలతో మల్యాల అడ్డ రోడ్డు సమీపంలో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు వేరే బస్సుల్లో వెళ్లడానికి తిప్పలు పడ్డారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంవల్లే నిలిచిపోయినట్లు సమాచారం.

పండగ గిరాఖీ

☛ కిక్కిరిసిన బస్టాండ్ ☛ నేడూ రద్దీ కొనసాగే అవకాశం



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

రక్షాబంధన్‌కు వచ్చినవారు స్వస్థలాలకు బయల్దేరడంతో ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్‌స్టాండ్ ఆవరణలో ఎక్కడ చూసినా జనమే కనిపించారు. ప్లాట్‌ఫాంలు వదిలి ప్రయాణికులు ఇన్‌గేట్, కరీంనగర్-1, 2 డిపోల ముందు బస్సుల కోసం పడిగాపులు కాశారు. బస్సులురాగానే పరుగులు తీయగా సెక్యూరిటీ సిబ్బంది బస్సుల వద్ద ఉంటూ నేరుగా ప్లాట్‌ఫాంల పైకి వెళ్లేలా చూశారు.

అదనపు సర్వీసులు

జేబీఎస్ రూట్లో నిత్యం 330 బస్సులు తిరుగుతుండగా 120 సర్వీసుల్లో ముందస్తు సీట్ రిజర్వేషన్లు చేసుకునే వీలుండేది. రద్దీ దృష్ట్యా జేబీఎస్‌కు అదనంగా 200 బస్సులు నడపగా అందులో 180 సర్వీసుల్లో రిజర్వేషన్ వెసులుబాటు కల్పించారు. వీటితోపాటు అదనంగా మరో 40 సిటీ బస్సులను తెప్పించినట్లు ఆర్ఎం రాజు తెలిపారు. ఆర్ఎంతోపాటు కరీంనగర్ జోన్ సెక్యూరిటీ అధికారి భావ్‌రావు బస్టాండ్‌లో మకాం వేసి పరిస్థితిని పరిశీలించారు.

ముందస్తు రిజర్వేషన్

ప్రయాణికుల రద్దీ సోమవారం కొనసాగే అవకాశం ఉంది. దీంతో అధికారులు అదనపు సర్వీసులు తిప్పడం, అవసరమైతే సిటీ బస్సులు తెప్పించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాన్ రిజర్వేషన్ బస్సులతోపాటు ముందస్తు టికెట్ రిజర్వేషన్ కోసం అదనపు బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. అవకాశం ఉన్న ప్రయాణికులు ముందస్తు టికెట్ రిజర్వేషన్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.



డిపోలోకి చొచ్చుకెళ్లగా..

రెండో డిపోలో ఎలక్ట్రిక్ బస్సులు ఉండగా కొందరు ప్రయాణికులు డిపోలోకి చొచ్చుకు వెళ్లి బస్సు ఎక్కడానికి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. జేబీఎస్, కామారెడ్డి, వరంగల్, హనుమకొండ, గోదావరిఖని, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల రూట్లలో తీవ్రమైన రద్దీ నెలకొంది. పలు రూట్లలో సరిపడా బస్సులు లేక ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పలేదు.

చేతుల శుభ్రత.. ఆరోగ్య భద్రత

పిల్లలకు అలవాటుగా మారితే వ్యాధులు దూరం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి

వర్షాకాలంలో పిల్లలు సీజనల్, అంటువ్యాధుల బారిన పడుతుంటారు. వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి. చేతులను శుభ్రంగా ఉంచుకుంటే పలు రకాల వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. తీసుకునే ఆహారం, తాగే నీరు వేడిగా, శుద్ధిగా ఉంటే ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పాఠశాలల్లో అవగాహన

చిన్నారులు ఆరుబయట మట్టి, ఇసుకలో ఆటలాడి చేతులను శుభ్రం చేసుకోకపోవడం తదితర కారణాలతో వ్యాధులు ప్రబలే ప్రమాదముంది.



మెట్‌పల్లి బడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ అధికారి

అపరిశుభ్ర చేతులతో భోజనం తినడం వల్ల హానికర సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్లు, విరేచనాలు, శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. ఉమ్మడి జిల్లాలో చాలా పాఠశాలల్లో చేతుల శుభ్రతపై విద్యార్థులకు వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ఇది అలవాటు చేసుకుంటే జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు రావు. శరీరంలోకి బ్యాక్టీరియాలు చేరకుండా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో బడికి వెళ్లే పిల్లల వివరాలు ఇలా..

జిల్లా	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్న సిరిసిల్ల
పాఠశాలలు	850	692	579	533
విద్యార్థులు	57,946	37,814	29,171	39,161

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- చేతుల శుభ్రతతో డయేరియా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా అరికట్టవచ్చు.
- మట్టిలో ఆడి, మలవిసర్జన తర్వాత చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోక ఆహారం తీసుకుంటే కడుపులో నులి పురుగులు తయారై రక్తహీనతకు దారి తీస్తోంది. తద్వారా రోగనిరోధకశక్తి తగ్గి త్వరగా వ్యాధుల బారిన పడే ప్రమాదముంది.
- పిల్లలు చేతిగోళ్లను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. గోళ్లలో మట్టి చేరకుండా ఉంటుంది.
- పెంపుడు జంతువులను, దుమ్ము, ధూళి ఉన్న వస్తువులను తాకిన తర్వాత, ఆహారం తినడానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత సబ్బు ఉపయోగించాలి.

తల్లిదండ్రులు నేర్పించాలి



శుభ్రత లోపంతో పిల్లలకు అనేక వ్యాధులు వస్తాయి. తల్లిదండ్రులు చేతులను శుభ్రంగా కడుక్కోవడాన్ని పిల్లలకు నేర్పించాలి. పిల్లల చేతి గోళ్లలో తరచూ మట్టి చేరడం గమనిస్తుంటాం. దీంతో కడుపులో ఇన్ఫెక్షన్లు, నులి పురుగుల సమస్యలు వస్తాయి.

-డా.రాజేశ్వర్, పిల్లల వైద్య నిపుణులు, మెట్‌పల్లి సీహెచ్‌సీ



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

మన్‌కీబాత్ వీక్షించిన హోంశాఖ సహాయ మంత్రి

తెలంగాణచౌక్(కరీంనగర్) : ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 137వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించారు. మన్‌కీబాత్ ద్వారా మోదీ వివిధ అంశాలపై తన అభిప్రాయాలు వివరిస్తుంటారన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యలో ప్రవేశాలకు పది రోజులే గడువు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ దూర విద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి సెప్టెంబరు 9 వరకు అవకాశం ఉందని కరీంనగర్ స్టడీ సెంటర్ సమన్వయకర్త సత్యప్రకాశ్ తెలిపారు. 'ఈనాడు' 'ఫోన్-ఇన్'లో పాఠకుల ప్రశ్నలకు ఆయన జవాబులిచ్చారు. ప్రవేశాలు, పరీక్షలు, కొత్త కోర్సులపై లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.



ఫోన్-ఇన్

☛ కరీంనగర్ స్టడీ సెంటర్ సమన్వయకర్త సత్యప్రకాశ్

? 2024లో ఎంఏ తెలుగులో ప్రవేశం తీసుకున్నా. పరీక్షలకు హాజరు కాలేదు. ఇప్పుడు రాయొచ్చా **-హరిప్రసాద్, మంచిర్యాల**
✔ సంవత్సరం వారీగా రాసుకోవచ్చు. సెప్టెంబరులో ప్రథమ సంవత్సరం, అనంతరం రెండు, మూడో సంవత్సరాల పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

? ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ కోర్సు చేయొచ్చా **-సందీప్‌కుమార్, గోదావరిఖని**
✔ ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. రూ.1600 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

? నేను జీఎన్ఎం చేసి ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నా. ఇప్పుడు ఓపెన్ డిగ్రీ చేయొచ్చా **-రవీందర్, వరంగల్**
✔ డిగ్రీ చేసుకోవచ్చు.

? ఓపెన్ యూనివర్సిటీలో జాయిన్ అయి జగిత్యాల సెంటర్‌లో డిగ్రీ చేయొచ్చా **-చందు, జగిత్యాల**
✔ జగిత్యాల సెంటర్‌ను ఎంపిక చేసుకోండి.

? 2024లో పీజీలో నమోదు చేసుకున్నా. కొన్ని పరీక్షలు రాయలేదు. ప్రస్తుతం మరోసారి మరో సబ్జెక్టుతో అడ్మిషన్ తీసుకోవచ్చా **-రాజు, వేములవాడ**
✔ తీసుకోవచ్చు.

? మా అమ్మాయి కరీంనగర్ అధ్యయన కేంద్రంలో బీఎస్సీ ఓపెన్ డిగ్రీ చేస్తోంది. ఇక్కడే ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాలా? లేదా మంచిర్యాలకు మార్చుకోవచ్చా **-టి.గోపాల్, జన్నారం, మంచిర్యాల జిల్లా**
✔ ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాలి. స్టడీ సెంటర్‌ను కరీంనగర్ నుంచి మంచిర్యాలకు మార్చుకునేందుకు హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

? ఓపెన్ వర్సిటీలో పదేళ్ల కిందట అడ్మిషన్ తీసుకున్నాను. పరీక్షలు రాయలేదు. ఇప్పుడు రాయొచ్చా **-బత్తుల లక్ష్మీనారాయణ, చొప్పదండి**
✔ సెప్టెంబరు 9 వరకు అవకాశం ఉంది. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి తీసుకొని రండి.

? పీజీలో ఈ ఏడాది కొత్త కోర్సులు ఏమైనా ప్రవేశపెట్టారా **-ఎన్.పద్మావతి, కరీంనగర్**
✔ ఈ ఏడాది ఎం.ఈడీ రెండేళ్ల కోర్సుతో పాటు, ఎంఎస్‌డబ్ల్యూ రెండేళ్ల కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

? 1995-96లో డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశాను. రెండో సంవత్సరం రాయలేదు. ఇప్పుడు రాయొచ్చా **-శ్యామల, కరీంనగర్**
✔ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి పొంది రీ అడ్మిషన్ తీసుకోవాలి.

కూరగాయల నర్సరీ.. మీ కోసం అనుమతి తప్పనిసరి

న్యూస్‌టుడే, మానకొండూర్

కూరగాయల సాగుకు రైతులకు నారు అవసరం కావడంతో నర్సరీలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. అయితే నర్సరీల నిర్వహణకు అనుమతులు పొందడం తప్పనిసరి అని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

☛ నర్సరీ ఏర్పాటుకు ఉద్యాన విస్తరణ అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తు ఫారం తీసుకోవాలి. ☛ భారతీయ స్టేట్ బ్యాంకులో నిర్ణీత రుసుం చలానా రూపంలో చెల్లించి రసీదు పొందాలి. ఇందులో ఎకరానికి రూ.2500 చెల్లించాల్సి ఉంటుంది.

☛ పూర్తి చేసిన దరఖాస్తు పత్రానికి బ్యాంకులో చెల్లించిన చలానా రసీదును జత చేసి.. దరఖాస్తును స్థానిక ఉద్యాన విస్తరణ అధికారికి లేదా జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సమర్పించాలి

కావాల్సిన పత్రాలు
★ పట్టాదారు పాస్ పుస్తకం ★ రైతు, కౌలు రైతు ఆధార్ కార్డు ★ మట్టి, నీటి పరీక్ష నివేదికలు ★ రైతు ఒప్పంద పత్రం ★ గ్రామ పంచాయతీ ఆమోద పత్రం ★ నర్సరీ యజమాని ఆధార్

మూల్యాంకనానికి ప్రత్యేక నిధులు

న్యూస్‌టుడే, వెల్గటూరు

పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం విధానంలో ఎస్ఏ- 1, 2 పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు తీసుకొచ్చింది. మూల్యాంకన వ్యవస్థ విశ్వసనీయతను బలోపేతం చేసేందుకు జవాబు పత్రాల మూల్యాంకనంలో నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనం, కచ్చితత్వాన్ని పెంపొందించేలా బాహ్య మూల్యాంకన విధానాన్ని ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు పరిచేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు. దీని కోసం జిల్లాల వారీగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించారు.

☛ మండల స్థాయిలో శిబిరం నిర్వహణకు ఏక మొత్తంలో రూ.10వేలు కేటాయించారు. ప్రాథమిక స్థాయిలో ఒక్కో జవాబు పత్రానికి రూ.2, హైస్కూల్ స్థాయిలో రూ.3 పారితోషికాన్ని చెల్లిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.50.49లక్షలు కేటాయించారు.

ఉమ్మడి జిల్లా గణాంకాలు:

జిల్లా	మండలాలు	పాఠశాలలు	విద్యార్థులు	నిధులు(రూ.లలో)
జగిత్యాల	20	770	47,532	17,32,040
కరీంనగర్	16	631	32,209	12,21,138
పెద్దపల్లి	14	530	24,637	9,61,322
రాజన్న సిరిసిల్ల	13	486	32,376	11,35,062

మిల్లులో 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలు

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలున్నాయనే సమాచారంతో హుజూరాబాద్ మండలం రాంపూర్‌లోని తిరుమల ఇండస్ట్రీస్‌లో ఆదివారం సివిల్ సప్లై, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేపట్టారు. మిల్లులో రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. అదే సమంలో మరో రెండు ట్రాలీ ఆటోల్లో రేషన్ బియ్యం రావటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొని. . ఎక్కడి నుంచి వచ్చాయనే వివరాలపై ఆరా తీస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రేషన్ దుకాణంలో నుంచి కొంత సేకరించినట్లు సమాచారం. మిల్లులో బియ్యం నిల్వలు సుమారు 300 క్వింటాళ్ల వరకు ఉన్నాయన్నారు. ఈ మేరకు మిల్లు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సివిల్ సప్లై శాఖ అధికారులు చెప్పారు. మిల్లును సైతం సీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. డీటీసీఎస్ విజయ్‌కుమార్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్‌లు వినోద్‌కుమార్, ఎండీ.అన్వరుల్లా ఖాన్, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మిల్లులో బియ్యం లెక్కలు వేస్తున్న సివిల్ సప్లై అధికారులు



జెండాపై కవిరాజు పుస్తకావిష్కరణలో మేయర్ శ్రీనివాస్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, కవులు, పరిషత్ ప్రతినిధులు

దేశభక్తి కావ్యంగా 108 మంది కవుల సంపుటి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జెండాపై కవిరాజు సంపుటి 108 మంది తెలుగు రాష్ట్రాల కవుల కవిత్వంతో దేశభక్తి కావ్యంగా నిలుస్తుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ భగవతి పాఠశాల వేదికగా ఆదివారం జాతీయ సాహిత్య పరిషత్ జిల్లాశాఖ రూపొందించిన సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిప్యూటీ మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ సమాజంలో జాతీయవాద ఆలోచనలను రేకెత్తిస్తూ కవులు అక్షరాన్ని ఆయుధంగా మలచారని పేర్కొన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జాతీయ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ యువతలో దేశీయ భావజాలాన్ని నూరిపోసేలా కవులు కృషి చేయాలన్నారు. పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయులు, కవి, అవధాని డా.గండ్ర లక్ష్మణ్‌రావు, భగవతి విద్యాసంస్థల ఛైర్మన్ రమణారావు, పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాజుల రవీందర్, ఆర్ఎస్ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్‌లు, నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమాలో తన పాట ఉపయోగించారని ఫిర్యాదు



రెండో ఠాణా సీఐకి ఫిర్యాదు చేస్తున్న గాయకురాలు తేలు విజయ, తెలంగాణ రక్షణ సేన నాయకులు

కరీంనగర్ సాంస్కృతికం, నేరవార్తలు న్యూస్‌టుడే: సొంతంగా రచించి, పాడిన 'పున్నామ పున్నామ' పాటను తన అనుమతి లేకుండా జాంబిరెడ్డి-2 సినిమాలో ఉపయోగించారని తెలంగాణ ఉద్యమ గాయకురాలు తేలు విజయ ఆదివారం కరీంనగర్ రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తేలు విజయ వివరాలను పత్రికాముఖంగా వెల్లడించారు. తాను ఎంతో కష్టపడి రూపొందించుకున్న పున్నామ పాటను తన అనుమతి లేకుండా సినిమాలో ఉపయోగించి తన హక్కులు, మనోభావాలకు భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా నిర్మాతపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి లింగంపల్లి నాగరాజు, నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ రేంజ్ అధికారి సస్పెన్షన్

మల్లాపూర్: జగిత్యాల అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ అర్పణ ఉత్తర్వులను జారీ చేశారు. ఒబులాపూర్ దాబాలో అటవీ అధికారుల విందుపై సమగ్ర విచారణ చేపట్టగా.. దీనికి కారకుడైన మహేశ్‌గౌడ్‌ను సస్పెన్షన్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి పట్టపగలే మందుతో విందు చేసుకున్న సంఘటనలో మరో అయిదుగురు ఉద్యోగులకు ఇప్పటికే మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. విచారణ పూర్తిస్థాయిలో జరిగితే మరింతమంది అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు ప్రణాళిక

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: అల్గునూరులోని వెల్చాల జగపతి రావు(వీజేఆర్) మెమోరియల్ క్రికెట్ మైదానం, అకాడమీని ఆదివారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) బాధ్యులు సందర్శించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ(సీఓసీ) అధిపతి అంబటి రాయుడు, జిల్లా క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్, మాజీ హెచ్‌సీఏ కార్యదర్శి టి.శేషనారాయణ్, హెచ్‌సీఏ మహిళా క్రికెట్ అభివృద్ధి విభాగం అధిపతి సునీతా ఆనంద్‌లతో కూడిన బృందంరాగా కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగంరావు స్వాగతం పలికారు. వీజేఆర్ మెమోరియల్ క్రికెట్ మైదానం అభివృద్ధి, అందుబాటులోని మౌలిక సదుపాయాలు, టర్ఫ్ వికెట్లు, ప్రాక్టీస్ నెట్స్ గురించి వివరించారు. బీసీసీఐ స్థాయి టోర్నమెంట్లతో పాటు టీజీ-20 లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు అనువైన ప్రమాణాలతో మైదానం ఉందని రాయుడు అభిప్రాయపడ్డారు. హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లను కరీంనగర్‌లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. శేషనారాయణ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో ఉన్నత ప్రమాణాలతో కూడిన క్రికెట్ అకాడమీని త్వరలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు హెచ్‌సీఏ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అంబటి రాయుడు చిత్రంలో హెచ్‌సీఏ బాధ్యులు

అండర్-16 బాలురు, మహిళా క్రికెటర్లతో ముచ్చట్లు

హెచ్‌సీఏ నిర్వహించిన మహిళల ఓపెన్ సెలెక్షన్స్ ట్రయల్స్‌కు హాజరైన 40 మంది మహిళా క్రికెటర్లు, కేడీసీఏ అండర్-16 బాలురతో అంబటి రాయుడు ముచ్చటించారు. జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులు అందుబాటులోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సునీత ఆనంద్ మహిళా క్రికెటర్లతో మాట్లాడి వారి శిక్షణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. ప్రతిపాదిత హెచ్‌సీఏ అకాడమీ ద్వారా కరీంనగర్‌తోపాటు ఉత్తర తెలంగాణలోని పరిసర జిల్లాలకు చెందిన బాలురు, బాలికలు, పురుషులు, మహిళా క్రికెటర్లకు కోచింగ్, మెరుగైన శిక్షణ, ఉన్నతస్థాయి క్రికెటర్లుగా ఎదిగేందుకు అవసరమైన అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. హెచ్‌సీఏ సభ్యులు చెకూరి వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, టీజీ20 హెడ్ క్రికెట్ ఆపరేషన్స్ భరణి, హెచ్‌సీఏకు చెందిన నిశాంత్‌రావులు పాల్గొన్నారు.

స్వేరోస్ అంటే ఆలోచన, ఆచరణ



నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

గంగాధర, న్యూస్‌టుడే: కులం, మత, ప్రాంతం, రాజకీయం, పురుష, మహిళలని కాకుండా ఆలోచన, ఆచరణ, అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవానికి ప్రతీకగా స్వేరోస్ ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గంగాధరలో ఆదివారం స్వేరోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞాన సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడారు. సామాజిక మాధ్యమాలకు బానిసలై నేడు ఎందరో విద్యార్థులు, యువత నేర ప్రవృత్తిలోకి దిగుతున్నారని అన్నారు. నల్గొండ జిల్లాలో పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డిని పదో తరగతి విద్యార్థులు హత్య చేయడం బాధించిందన్నారు. స్వేరో అంటే కఠినమైన క్రమశిక్షణ, ప్రేరణ అని చెప్పారు. ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు స్వేరో గీతం ఆలపించి ధ్యానం చేయాలన్నారు. స్ఫూర్తినిచ్చే వారిని స్మరించుకోవాలన్నారు. ఉదయం నిర్వహించిన 5 కే పరుగు పందెంలో రాణించిన ముగ్గురికి ప్రోత్సాహకాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, స్వేరోస్ ప్రతినిధులు కొంకటి శేఖర్, దాసరి ఉష, నాగి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా నాయకులను ఎందుకు రాజీనామా కోరలేదు

బాలికపై అత్యాచారం కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పార్టీపరంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. గంగాధరలో మీడియాతో మాట్లాడారు. భాజపా నాయకులను వెనకేసుకుంటూ భారాసపై అభాండాలు వేస్తున్నారన్నారు. ఎంఐఎం ఎమ్మెల్సీపై వచ్చిన ఆరోపణలకు ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చర్యలు తీసుకున్నారని చెప్పారు. భాజపా అధికార ప్రతినిధి సంగప్పపై ఆరోపణలు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

ఆటోను ఢీకొన్న కోళ్ల వ్యాన్

కూలీ మృతి, పలువురికి గాయాలు



లింగాల దేవమ్మ

గంగాధర, న్యూస్‌టుడే: కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి గంగాధర ప్రధాన కూడలిలో ఆదివారం కోళ్ల మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో కూలీలతో వెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గంగాధర మండలం మంగపేటకు చెందిన 9 మంది మహిళా కూలీలు ట్రాలీ ఆటోలో బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఇదే సమయంలో జగిత్యాల వైపు నుంచి కోళ్ల మినీ వ్యాన్ చోదకుడు పవన్ అతివేగంగా ముందుకు వెళ్లే క్రమంలో ఆటోను ఢీకొట్టగా బోల్తాపడింది. తీవ్రంగా గాయపడ్డ లింగాల దేవమ్మ(59)తోపాటు చొప్పదండి శైలజ, నాగెల్లి రాధ, అతికం మమత, సరోజన, ఆటో చోదకుడు చారీని కరీంనగర్‌లోని ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దేవమ్మ మృతి చెందారు. క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులను కరీంనగర్‌లోని ఆసుపత్రిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని సీఎంవో కార్యాలయానికి ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గాయపడ్డ వారిని గంగాధరలో పరామర్శించారు. మృతురాలు దేవమ్మ భర్త దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.



ప్రమాదంలో గాయపడ్డ మహిళలు

సంవత్సరీకం చేయడానికి వచ్చి.. చెరువులోపడి

ప్రమాదవశాత్తు ఒకరి మృత్యువాత



మురళి

గంగాధర, న్యూస్‌టుడే: గంగాధర మండలం బూర్గుపల్లిలో ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు ఆడెపు మురళి(47) భీవండిలో చేనేత పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మురళి తల్లిదండ్రుల మృతితో సంవత్సరీకం చేయడానికి కుటుంబీకులతో కలిసి వచ్చారు. మురళి బూర్గుపల్లిలోని చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి నీటిలో మునిగి ఈత రాక మృతి చెందాడు. భార్య సరళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
జగిత్యాల 99480 71117
కోరుట్ల 9491324656
ధర్మపురి 94403 88638

? **మల్యాల :** మల్యాల మండల పరిషత్ చౌరస్తా సమీపంలోని పలువురు ఇళ్ల యజమానులు ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మురుగు కాలువ పైనే అక్రమంగా పలు నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిని తొలగించాలి.
- స్థానికులు, బ్లాక్ ఏరియా, ముత్యంపేట

✔ పరిశీలించి, వాటిని తొలగించాలని నిర్మాణదారులను ఆదేశించాం.
- శేఖర్, పంచాయతీ కార్యదర్శి

విద్యుత్తు స్తంభం తొలగింపు

పెగడపల్లి: మండలకేంద్రం నుంచి నందగిరి వైపు వెళ్లే తారు రోడ్డు అంచునే ఉన్న విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా మారాయని ఇటీవల ప్రచురితమైన చిత్రవార్తకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. రైతువేదిక సమీపంలో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా మారిన స్తంభాన్ని తొలగించి తీగలను సరిచేశారు. ఏఈ హరీష్‌రావు, లైన్‌ఇన్‌స్పెక్టర్ బాలూనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలను ఆదుకుంటున్నాం


పోతారం సింగిల్‌విండో పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే సత్యం

మల్యాల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందని స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం పోతారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పాలకవర్గ నూతన ఛైర్మన్‌గా నియమితులైన గంగాధర్, సభ్యులుగా విజయ, ముత్యాల రమేశ్, గజ్జెల లక్ష్మి, శంకర్, దండె మనోహర్, శెట్టి లక్ష్మారెడ్డి, నల్ల వసంత, మనోహర్‌రెడ్డి, భూమక్క, బొజ్జ తిరుపతి, గుర్రం చంద్రయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామస్థుల విన్నపం మేరకు జగిత్యాల నుంచి పోతారం గ్రామానికి బస్సు సౌకర్యంతోపాటు, 50 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లడించారు. పలువురు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్(కోరుట్ల), న్యూస్‌టుడే: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశాలున్నందున ప్రజలు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలని సీహెచ్‌వో వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో డెంగీ నివారణ, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచి రాజగంగారాం, అధికారులు ఎండీ. బేగ్, రజిత పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో వేణుగోపాల్

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భారాస జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. మెట్‌పల్లిలో ఆదివారం భారాస నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

మల్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి అప్పగించాల్సిన కోట్లాది రూపాయల విలువైన 'కస్టమ్స్ మిల్లింగ్' బియ్యాన్ని స్వాహా చేసిన రైసు మిల్లర్లపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించడంతోపాటు వారి నుంచి బియ్యాన్ని రికవరీ చేయాలని అగ్రివర్సిటీ మాజీ సభ్యులు రాంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని వేలం వేయాలని డిమాండు చేశారు. సేంద్రీయ ఎరువులతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తూ ప్రోత్సహించాలన్నారు.

ఎన్ని విమర్శలు చేసినా అభివృద్ధి ఆగదు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: ఎవరెన్ని విమర్శలు చేసినా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ జగిత్యాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాలలో ఆదివారం మాట్లాడుతూ భారాస అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేసీఆర్ కుటుంబాన్ని తీవ్రంగా విమర్శించిన జీవన్‌రెడ్డి.. ఇప్పుడు వారికి వత్తాసుగా ప్యాకేజీ మాటలు మాట్లాడుతున్నారన్నారని విమర్శించారు. జగిత్యాలకు 4,500 ఇళ్ల మంజూరులో తన పాత్ర గురించి ప్రజలకు తెలుసని, ప్రభుత్వంతో కలిసి పని చేస్తేనే ఇందిరమ్మ అర్బన్ హౌజింగ్ కాలనీకి రూ.34 కోట్లు మంజూరయ్యాయన్నారు. పురపాలక అధ్యక్షురాలు వాణి, డీసీసీ అధ్యక్షుడు నందయ్య, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు మోహన్, ప్రశాంత్‌రావు, పిట్ట ధర్మరాజు, మన్సూర్, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆర్యవైశ్య సంఘం శ్రీకారం చుట్టింది. ఆదివారం సంఘం అధ్యక్షులు రాంబాబు-సంతోషిణి దంపతులు భూమిపూజ చేశారు. పురపాలక ఛైర్మన్ లింబాద్రి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం



ఇక్కడ కనిపిస్తున్న రహదారి ధర్మపురి మండలం నక్కలపేటలోనిది. ఆర్‌అండ్‌బీ రహదారిపై నీళ్లు నిలిచి బురద పేరుకుపోయింది. మరోవైపు రోడ్డు కోతకు గురైంది. దీంతో ఈ దారిలో బీర్‌పూర్, తుంగూరు, కలమడుగు, జన్నారం, ఖానాపూర్, నిర్మల్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- న్యూస్‌టుడే, ధర్మపురి గ్రామీణం

పల్లె దవాఖానా ప్రారంభమెప్పుడో?

మల్లాపూర్ మండలం సాతారంలో రూ.20లక్షలు ఎన్‌హెచ్‌ఎం నిధులతో నిర్మించిన పల్లె దవాఖానా నిర్మాణం పూర్తై రెండేళ్లు గడుస్తున్నా.. భవనం ప్రారంభించకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం వైద్యసిబ్బంది పాత పంచాయతీ భవనంలోనే విధులను నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి ఆయుష్మాన్ ఆరోగ్య పథకం కింద నిర్మించిన భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మల్లాపూర్**



అపరిశుభ్రంగా బస్టాండ్ ఆవరణ


బస్టాండ్ ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం

మెట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బస్టాండ్ ముందు ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత సిబ్బంది తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం**

రైల్వే స్టేషన్ కిటకిట

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి రైల్వేస్టేషన్ ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. రాఖీ పండుగను పండుగను ముగించుకుని మళ్లీ హైదరాబాద్ వెళ్లాలంటే బస్సులు ఎక్కువగా లేవని పెద్ద సంఖ్యలో రైలు ప్రయాణాన్ని ఎంచుకున్నారు. దీంతో మధ్యాహ్నం 4 గంటల సమయంలో కరీంనగర్ వచ్చిన కాచీగూడ రైలుకు ప్రయాణికులు పోటెత్తారు.



వీధి శునకం.. భయానకం

కోరుట్ల పట్టణంలోని రాంనగర్, బిలాల్‌పుర కాలనీల్లో గురువారం ఒక్కరోజే వీధి కుక్కలు 23 మందిని గాయపరిచాయి. ఇందులో నలుగురు పిల్లలున్నారు. వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. రోడ్లపై వెళ్లే వారిని వెంబడించి మరి దాడి చేసినట్లు బాధితులు తెలిపారు.

● కుక్కల దాడిలో నెలలో 166 మందికి చికిత్స

న్యూస్‌టుడే, కోరుట్ల

పట్టణంలో శునకాల బెడద తీవ్రంగా ఉంది. వృద్ధులు, పిల్లలు బయటకు వెళ్లాలంటే బయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంలో చర్యలు చేపట్టాలంటూ పురపాలక అధికారులతో పట్టణ ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఏమి చేయాలో తెలియక బల్దియా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జూన్, జులై, ఆగస్టు మూడు నెలల్లోనే 500 మంది కుక్కకాటు బాధితులకు చికిత్స అందించారు. వీరే కాకుండా చాలామంది బాధితులు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారున్నారు.

రోడ్లపైనే మాంసం విక్రయాలు

పట్టణంలో మటన్, చికెన్ విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించేందుకు మున్సిపల్ అధికారులు ఎలాంటి ఏర్పాటు చేయకపోవడంతో విక్రయదారులు రోడ్లపై విచ్చలవిడిగా నెలకొల్పి విక్రయాలు చేపడుతున్నారు. వినాభారోడ్, దర్వాజ, ఐబీ రోడ్, ఇతర కాలనీల్లో రోడ్లపైనే మాంసం విక్రయించడంతో వాటి నుంచి వెలువడే వ్యర్థాలను ఎక్కడ దొరికితే అక్కడ పడేయడంతో వాటిని కుక్కలు ఆహారంగా తీసుకుంటున్నాయి. మాంసం తినడం అలవాటుపడ్డ కుక్కలు ప్రజలపై దాడులు చేస్తాయని పశు వైద్యులు చెబుతున్నారు. మాంసం తినే కుక్కల్లో విచక్షణ తగ్గి ప్రజలపైకి ఎగబడి గాయపరుస్తున్నాయి.


కోరుట్లలో వీధి కుక్కలను పట్టిస్తున్న మున్సిపల్ అధికారులు

1616 శునకాలకు శస్త్ర చికిత్సలు

పట్టణ శివారులో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.20 లక్షలతో ఏబీసీ(ఎనిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాన్ని నిర్మించారు. పట్టణంలో మొత్తం 1,669 వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో కుక్కను పట్టుకెళ్లి శస్త్ర చికిత్స చేయించేందుకు హైదరాబాద్ చెందిన ఏజెన్సీకి పురపాలక సంఘం నుంచి రూ.1,650ల చొప్పున జనరల్ ఫండ్ నుంచి చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణంలో మొత్తం 1,616 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించారు. ఏబీసీ ద్వారా శునకాల సంఖ్య నియంత్రణ జరుగుతుంది. అయితే సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందినవారు

నెల	బాధితులు
జూన్ :	166
జులై :	172
ఆగస్టు :	160

నిత్యాన్నదానం అభినందనీయం

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాలలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సత్యసాయి సేవాసమితి నిత్యాన్నదాన సేవా ట్రస్ట్ ద్వారా రోగులు, వారి సహాయకులకు అన్న ప్రసాద వితరణ అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. నిత్యాన్న ప్రసాద వితరణ చేపట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని రోగులకు స్వయంగా వడ్డించి నిర్వాహకులను అభినందించారు. పురపాలక అధ్యక్షురాలు వాణి, ఆర్‌ఎంవో డాక్టర్ విజయ్‌రెడ్డి, సత్యసాయి సేవా ట్రస్టు కన్వీనర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


జగిత్యాల ప్రధాన ఆసుపత్రిలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

'నేను అడవిని మాట్లాడుతున్నాను' ఆవిష్కరణ

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ గేయ రచయిత డా.సుద్దాల అశోక్‌తేజ ఆదివారం బల్దియా ఛైర్మన్ మైలారపు లింబాద్రిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం తాను రాసిన 'నేను అడవిని మాట్లాడుతున్నాను' అనే పుస్తకాన్ని ఛైర్మన్‌కు బహుకరించారు. లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, పెరంబదూర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.


ఛైర్మన్ లింబాద్రిని సన్మానిస్తున్న అశోక్ తేజ

స్థలం కబ్జాపై చర్యలకు డిమాండ్

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: లలితా కళా సమితి స్థలం కబ్జా విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని స్వర్ణకారులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు సమావేశం ఏర్పాటు చేసుకుని మాట్లాడారు. ఎమ్మెల్యేలు గౌరవ అధ్యక్షులుగా ఉన్న ఈ కళా సమితి గ్రామీణ కళారంగానికి కీర్తి ప్రతిష్ఠలకు గౌరవం తీసుకువచ్చిందన్నారు. ఎందరో కళాకారులకు నిలయంగా ఉన్న కళా సమితి స్థలం కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకుని.. దీనికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అధ్యక్షుడు మహేష్, శ్రీపాద సతీష్, విద్యాసాగర్, లక్ష్మణ్, కృష్ణమాచారి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఛాతిలో నొప్పి వస్తుందని ఆసుపత్రికి!

● బయటికి వెళ్లిన కొద్దిసేపటికే హఠాన్మరణం
● వైద్యుల నిర్లక్ష్యమేనని కుటుంబీకుల ఆందోళన

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల క్రిటికల్ కేర్‌కు వచ్చిన ఒక వ్యక్తికి గుండె పరీక్షలు నిర్వహించి బయటకు వెళ్లిన కొద్దిసేపటికే కుప్పకూలి మృతి చెందిన విషాద ఘటన జగిత్యాలలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్‌కు చెందిన చక్రవర్తి(38) ఆదివారం కుటుంబసభ్యులతో జగిత్యాలకు వచ్చారు. ఛాతిలో నొప్పి వస్తుందని జగిత్యాల ప్రభుత్వ క్రిటికల్ కేర్‌కు ఆసుపత్రికి రావడంతో వైద్యులు ఆయనకు పరీక్షలు నిర్వహించారు. ఎలాంటి సమస్య లేదని చెప్పడంతో చక్రవర్తి బయటకు వెళ్లి ఓ టిఫిన్ సెంటర్‌లో అల్పాహారం చేస్తున్నారు. ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలారు. ఆయన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఆసుపత్రికి వచ్చినప్పుడే చేర్చుకుని చికిత్స అందిస్తే బతికేవారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకొని బాధితుల నుంచి వివరాలను సేకరించారు. తమకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు కోరారు.


ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

తెరసేలో పలువురి చేరిక

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్, ఏఎస్‌ఆర్ తండాకు చెందిన పలువురు యువకులు ఆదివారం తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా.రఘు వారికి కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీపై నమ్మకంతో యువకులు పెద్ద ఎత్తున చేరుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. శివకుమార్ నాయక్, శేఖర్, తిరుపతి, శివకుమార్, సురేష్, రఘు, వర్షిత్, వెంకటేశ్, రాజేష్, సంజీవ్, రవీందర్, గంగాధర్, నితిన్ తదితరులున్నారు.



పార్టీలో చేరిన యువకులతో రఘు

రైల్వేస్టేషన్లో రక్షణ కరవు


ప్రయాణికులు కూర్చునే చోటనే కుక్కలు


స్టేషన్ చుట్టూ అడవిని తలపించేలా పిచ్చిమొక్కలు

మెట్‌పల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి మాట దేవుడెరుగు.. కనీస రక్షణ లేక ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. స్టేషన్ నిర్మాణం చేశారనే సంబరం తప్ప.. ఏళ్ల నుంచి ఎలాంటి అభివృద్ధికి నోచుకోక ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. ఎటూ చూసిన పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తుంది. దీంతో పాములు, విష పురుగులతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు చిన్న చినుకు పడితే చాలు పైనుంచి వర్షం నీరంతా ప్రయాణికులు కూర్చుండే ఫ్లాట్‌ఫాంల వద్ద కారుతుంది. ఇలా స్టేషన్‌లో అయిదుచోట్ల ఇదే పరిస్థితి ఉండడం విశేషం. మరోవైపు స్టేషన్లో శునకాల బెడద తీవ్రంగా ఉంది. ప్రయాణికుల మధ్య నుంచే పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతూ భయానికి గురిచేస్తున్నాయి. నిత్యం ఇదే పరిస్థితి ఉండడంతో వీటిపై చర్యలు తీసుకునే వారు కరవయ్యారు. ప్రయాణికులపై దాడులు చేస్తే బాధ్యులు ఎవరవుతారో అధికారులకే తెలియాలి. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం**

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం వెంకట్రావుపేటలో అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వెంకట్రావుపేటకు చెందిన పెద్రం భీమక్క(78) 20 ఏళ్ల క్రితం నుంచి భర్తకు దూరంగా ఉంటూ అదే గ్రామానికి చెందిన జర్పుల నాగమ్మ వద్ద నివాసం ఉంటున్నారు. మూడేళ్ల క్రితం భీమక్కకు పక్షవాతం రావడంతో పూర్తిగా మంచానికే పరిమితమయ్యారు. అప్పటి నుంచి నాగమ్మ ఆమెకు సేవలు చేస్తూ వస్తున్నారు. నాలుగు రోజుల క్రితం నాగమ్మకు ఆరోగ్యం బాగలేకపోవడంతో వాల్గొండలో ఉంటున్న చిన్న కుమార్తె వద్దకు వెళ్తూ.. భీమక్క బాధ్యతలను చూసుకోవాలని పెద్ద కుమార్తెకు చెప్పారు. ఈ సమయంలో భీమక్క అనారోగ్యం దృష్ట్యా ఆసుపత్రికి తరలించే క్రమంలో కిందపడిపోయారు. తలకు గాయం కాగా మంచంపై పడుకొబెట్టే క్రమంలోనే మరణించారు. భీమక్క మృతిపై అనుమానాలు ఉన్నట్లు నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండగట్టులో కారు బోల్తా

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు (దిగువ) ప్రాంతంలోని స్టేజి సమీపంలోని ఆదివారం రాత్రి ఓ కారు డివైడర్లకు ఢీకొని బోల్తా పడింది. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు డివైడర్లకు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు జగిత్యాల మండలంలోని నర్సింగాపూర్ వాసులకు చెందినదిగా తెలిసింది. డివైడర్ల వద్ద సూచికలు లేకపోవడంతో ఇలా జరిగినట్లు స్థానికులు తెలిపారు.

రాయికల్ శివాలయంలో చోరీ

రాయికల్ పట్టణం : పట్టణంలోని శివాలయంలో చోరీ జరిగింది. ఆదివారం ఆలయంలో పరిశీలించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒకరు హుండీలోని నగదు ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తం కాగా.. చోరీకి పాల్పడిన వ్యక్తి మైనర్‌గా గుర్తించారు. ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సారా తరలిస్తున్న ఒకరి అరెస్టు

జగిత్యాల గ్రామీణం : జగిత్యాల గ్రామీణ మండలం పొలాస బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం సారా తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. జగిత్యాల గ్రామీణ మండలం ధర్మారానికి చెందిన లచ్చన్నగా గుర్తించారు. ఆతడి వద్ద నుండి 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తం

■ రెండువేల ఇళ్లు మంజూరు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: జగిత్యాల నియోజకవర్గానికి రెండవ విడతలో 2 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. జగిత్యాల మండలం తిమ్మాపూర్‌లో గాదె అన్నపూర్ణ-సంతోష్‌ల ఇందిరమ్మ గృహ ప్రవేశంలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. సర్పంచి మోహన్‌రెడ్డి, అనిత, గంగాధర్, సాగర్, మహిపాల్‌రెడ్డి, సురేశ్, రాజేశ్, శంకరయ్య, అనిల్ తదితరులున్నారు.

రాయికల్ : ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకరమవుతున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాయికల్ మండలంలోని అల్లీపూర్, తాట్లవాయి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలకు ఆయన హాజరై లబ్ధిదారులకు చీరలను కానుకగా అందజేశారు. సర్పంచులు గౌతమి, ఆకుల మల్లేశం, ఆత్మ ఛైర్మన్ గంగారెడ్డి, మాజీ ఎంపీపీ సంధ్యారాణి, నాయకులు ఉన్నారు.

■ రాఘవపట్నంలో ఉచిత వైద్య శిబిరం

గొల్లపల్లి : రాఘవపట్నంలో సర్పంచి కాసారపు భవాని, శ్రీలక్ష్మి హాస్పిటల్ డా.సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రవి, తిరుపతిగౌడ్, ప్రవీణ్‌గౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

■ ఒకటి నుంచి క్రీడా పోటీలు

పెగడపల్లి: మండల కేంద్రంలో సెప్టెంబరు 1 నుంచి 3 వరకు పాఠశాల క్రీడా పోటీలను(ఎస్‌జీఎఫ్) నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సులోచన, పీడీ రమేశ్ తెలిపారు. అన్ని పాఠశాలల నుంచి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లాస్థాయికి పంపనున్నట్లు తెలిపారు.

■ సంఘాలు-కార్యవర్గాలు

మేడిపల్లి : పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్వకోట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాజేందర్ నియమితులయ్యారు. సంఘ అభివృద్ధికి రాజేందర్ విశేష కృషి చేశారని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు పేర్కొన్నారు. నాయకులు మల్లేశం, నరేష్, చంద్రప్రకాష్, రాజేందర్‌రెడ్డి అభినందించారు.

కథలాపూర్(కోరుట్ల): కథలాపూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఆదివారం కథలాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుల సమక్షంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అధికార ప్రతినిధిగా అర్జున్, ప్రధాన కార్యదర్శులుగా శంకర్, నవీన్, ఉపాధ్యక్షులుగా పృథ్వీరాజ్, కిరణ్, అంజయ్య, కోశాధికారిగా దేవేందర్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నాయకులు లక్ష్మిరాజం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీమారం: మండల పెరిక సంఘం యువజన అధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా సత్యపాల్ ఎన్నికయ్యారు. మేడిపల్లి మండల యువజన అధ్యక్షుడిగా అరవింద్‌ను నియమించారు. వీరిని జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి పయ్యావుల మహేష్ తదితరులు పాల్గొని అభినందించారు.

మేడిపల్లి: మేడిపల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పోతు గణేష్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వజ్రలింగం, కోశాధికారిగా దాసరి బలరాం, ఉపాధ్యక్షుడిగా మధు, కార్యదర్శిగా రవి ఎన్నికయ్యారు.

పెగడపల్లి: పెగడపల్లి మండల ఎస్టీటీయూ నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కృష్ణవేణి శ్రీధర్, మహిళా అధ్యక్షురాలిగా శిరీష, కార్యదర్శిగా జహీరా బేగం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వేంకటేశం, ఆంజనేయులు తెలిపారు.

■ సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో వీబీజీ రామ్‌జీ పథకం కింద రూ.6 లక్షల నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు పనులకు సర్పంచి గంగాధర్, మాజీ ఎంపీపీ తోట నారాయణ ఆదివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. బాస గంగారెడ్డి, రాములు, సతీష్, సంజీవ్ నాయకులు పాల్గొన్నారు.

■ ఉచిత కంటి వైద్య శిబిరం

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాలలోని పావని కంటి ఆసుపత్రిలో ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 10 మందికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచిత నేత్ర శస్త్రచికిత్సలు చేసి మందులు, కళ్లద్దాలను ఆదివారం పంపిణీ చేశారు. డాక్టర్ విజయ్ తదితరులున్నారు.

వచ్చే నెలలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వచ్చేనెల 11లోగా మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించాలని తీర్మానించారు. జగిత్యాల పట్టణంలో జిల్లా విద్యాధికారి రామునాయక్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల కోసం కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రికెట్, ఖోఖో, యోగా అంశాలను ఎంపిక చేశారు. వచ్చేనెల 30లోగా జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి ఆదేశించారు.

రెడ్డి నిరసన దీక్షను విజయవంతం చేయాలి

జగిత్యాల ధరూర్‌క్యాంపు : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అన్ని విభాగాల్లో అమలు చేయాలనే డిమాండ్‌తో వచ్చేనెల 8న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిరసన దీక్ష తలపెట్టినట్లు రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల భూమారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డి జన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెర వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల ధరూర్‌లోని రెడ్డి సంఘం జిల్లా కార్యాలయం వద్ద దీక్ష పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించి ధర్నాకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. మనోహర్‌రెడ్డి, కొత్తపేట గంగారెడ్డి, గూడ రమేశ్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి, లింగారెడ్డి, సతీష్, రాంరెడ్డి, గడ్డం దీపక్ పాల్గొన్నారు.